అరెస్టులతో లగచర్ల లడాయిని ఆపలేరు

- కొడంగల్ రైతులపై సర్కార్ దౌర్జన్యం
- రైతులతో పెట్టుకున్నవ్.. నీ పతనం మొదలైంది : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : అరెస్టులతో లగచర్ల లడాయిని ఆపలేరని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. కొడంగల్ రైతులపై కాంగ్రెస్ సర్కార్ దౌర్జన్యం కొనసాగుతున్నదని శనివారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో మరో 8 మంది పేద గిరిజన రైతులకు సంకెళ్లు. ఇలా బెదిరింపులతో రైతులను భయపెట్టలేరు. రైతులతో పెట్టుకున్నావ్.. నీ పతనం మొదలైంది చిట్టినాయుడు' అని హరీశ్ హెచ్చరించారు.

కొనసాగుతున్న విచారణ..

వికారాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): లగచర్ల ఘటనపై విచారణ సాగుతున్నట్టు అదనపు డీజీ మహేశ్‌భగవత్ మీడియాకు వెల్లడించారు. శనివారం ఆయన కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు ఎస్పీ నారాయణరెడ్డితో వేర్వేరుగా రెండు గంటలపాటు సమావేశమై ఘటన జరిగిన తీరుపై చర్చించినట్టు తెలిసింది. ఈ ఘటనలో 47 మందిని నిందితులుగా రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్న పోలీసులు శుక్రవారం వరకు 21 మందిని రిమాండ్‌కు తరలించగా, శనివారం మరో ఎనిమిదిమందిని అదుపులోకి తీసుకున్నారు.

కలెక్టర్‌కు మరింత భద్రత

- మరో ఇద్దరు గన్‌మెన్లను కేటాయించిన ప్రభుత్వం

వికారాబాద్, నవంబర్ 16 : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ప్రభుత్వం మరింత భద్రత కల్పించింది. ఇప్పటివరకు ఇద్దరు గన్‌మెన్లు ఉండగా.. ఇటీవల లగచర్లలో కలెక్టర్‌పై దాడి జరిగిన నేపథ్యంలో మరో ఇద్దరు గన్‌మెన్లను ప్రభుత్వం కేటాయించింది. దీంతో గన్‌మెన్ల సంఖ్య నాలుగుకు చేరింది

రాహుల్.. లగచర్లకు రావేం?

- బీఆర్‌ఎస్‌ది తెలంగాణ పేగుబంధం
- అరెస్టులతో ప్రశ్నించేవాళ్లను అడ్డుకోలేరు
- బీఆర్‌ఎస్ మహిళా, మాజీ మహిళా ప్రజాప్రతినిధుల ఫైర్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ. చిత్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పాలన నియంతృత్వాన్ని తలపిస్తున్నదని బీఆర్‌ఎస్ మహిళా, మాజీ మహిళా ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్, గుజరాత్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో మహిళలకు అన్యాయం జరిగిందని రెక్కలు కట్టుకొని వాలిపోయే రాహుల్‌గాంధీ.. లగచర్లకు ఎందుకు రారు? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలతో బీఆర్‌ఎస్‌కు పేగుబంధం ఉందని, అందుకే ఏ వర్గం ఆపదలో ఉన్నా పరుగెత్తుకెళ్లటం తమ బాధ్యత అని స్పష్టంచేశారు. ప్రభుత్వ దమనకాండను, అవినీతి అక్రమాలను నిత్యం ప్రశ్నిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు సహా ఇతర నాయకులను అరెస్టు చేస్తాం, జైళ్లో పెడ్తామంటే ఉద్యమాలు ఆగిపోవనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించాలని సూచించారు. శనివారం తెలంగాణ భవన్‌లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ మీడియాతో మాట్లాడారు. లగచర్లలో మహిళలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తుల ఉమ.. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. సీఎం రేవంత్ తన కుటుంబ సభ్యుల కోసమే ఫార్మా సిటీ పేరుతో లగచర్ల తదితర ప్రాంతాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గిరిజనుల భూమిని గుంజుకోవటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఉన్న భూమిపోతే తమ బతుకేంటని ప్రశ్నించినందుకు చిత్రహింసలు గురిచేయటం ఏంటి? అని ప్రశ్నించారు. తన జీవితంలో ఏనాడూ 'జై తెలంగాణ' అనని రేవంత్‌రెడ్డికి ప్రజల కష్టసుఖాలు ఏమి తెలుసని పేర్కొన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే మహిళల పరిస్థితి ఇలా ఉంటే.. రాష్ట్రంలో పరిస్థితి ఏంటని నిలదీశారు. తనపై దాడి జరుగలేదని స్వయంగా కలెక్టరే చెప్తుంటే, దాడి జరిగిందని, అందుకు కేటీఆరే కారణమని పేర్కొనటం దుర్మార్గమన్నారు. లగచర్ల ఉదంతంపై రాహుల్‌గాంధీతోపాటు మేధావులు, ప్రజాసంఘాలు స్పందించాలని డిమాండ్ చేశారు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ ఉంటామని చెప్పే ఎర్రజెండా పార్టీలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు.

పేదలను అణగదొక్కితే గుణపాఠం తప్పదు

పేదల జీవితాలను మట్టుపెట్టడమే ప్రజాపాలనా? అని ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రశ్నించారు. అమాయక గిరిజనుల జీవితాలతో చెలగాటమాడితే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఎం నియోజకవర్గంలోనే ఇంత దుర్మార్గం జరుగడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రజల సమ్మతితో భూసేకరణ జరుగాలే తప్ప, బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. అర్ధరాత్రి ఆడపిల్లలు, చిన్నపిల్లలు, వృద్ధులు అని కూడా చూడకుండా పోలీసులు కర్కషంగా వ్యవహరించిన తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గిరిజనులకు అన్యాయం జరిగితే ఊరుకోం

ఫార్మా కంపెనీ పేరుతో కొడంగల్‌లో జరుగుతున్న దారుణాన్ని ప్రతీ ఒక్కరూ ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ సూచించారు. లగచర్ల బాధితుల కష్టాలు పగవారికి కూడా రాకూడదని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్తే కడుపు తరుక్కుపోయిందని, వారి ఆవేదన వర్ణణాతీతమని పేర్కొన్నారు. గిరిజనులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పేదలకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దారుణమని.. కేసులు, అరెస్టులకు బీఆర్‌ఎస్ భయపడదని తేల్చిచెప్పారు.

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

తమ్ముడి అరెస్టు వెనుక మహేందర్‌రెడ్డి హస్తం!

నరేందర్‌రెడ్డి అరెస్టుపై ఎందుకు స్పందించడం లేదు

కడా చైర్మన్‌ను పరామర్శించిన పట్నం.. తమ్ముడిని కలిసే తీరికే లేదా?

నరేందర్‌రెడ్డి, రైతుల కుటుంబాలకు అండగా ఉంటాం: రోహిత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తేతెలంగాణ): రైతులకు అండగా నిలిచిన కొడంగల్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు వెనుక ఆయన అన్న, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి హస్తం ఉన్నదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆరోపించారు. ఒకవేళ ఆయన హస్తం లేకుంటే ఇప్పటి వరకు తన సోదరుడిని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్‌ఎస్ కార్మిక నేత విజయ్‌కుమార్, నాయకులు రవీందర్‌రెడ్డి, శేఖర్, వెంకటయ్య, కృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కడా చైర్మన్‌ను పరామర్శించిన వారికి రైతులు, సొంత తమ్ముడిని పరామర్శించే తీరికే లేదా అని ప్రశ్నించారు. 90 ఏండ్ల వయసున్న తల్లి, తమ్ముడి భార్యాబిడ్డల ఆవేదనను పట్టించుకోకపోవడంలో ఔచిత్యమేమిటని నిలదీశారు. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసిన మహేందర్‌రెడ్డి ఆయన సతీమణి సునీత నియోజకవర్గ ప్రజలను ఏం ఉద్ధరిస్తారని పేర్కొన్నారు. ఆస్తులను సంపాదించుకోవడం, కాపాడుకోవడంపై ఉన్న ధ్యాస ప్రజా సేవపై లేదని దుయ్యబట్టారు. రికాణా లేని ఆయన సీఎం దగ్గర చీఫ్ విప్ పదవి తీసుకొని రాష్ట్రంలో రికాం లేకుండా తిరుగుతున్నారని ఆరోపించారు.

పచ్చని పొలాల్లో ఫార్మా కంపెనీలెందుకు?

'బీఆర్‌ఎస్ హయాంలో సేకరించిన 14 వేల ఎకరాల భూమి ఉండగా, పచ్చని పంట పొలాల్లో ఫార్మా కంపెనీలు ఎందుకు' అని పైలట్ రోహిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొమ్మిది నెలుగా లగచర్ల రైతులు ఫార్మా కంపెనీలు వద్దని మొత్తుకుంటున్నా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తుందని ధ్వజమెత్తారు. భూములు పోతాయనే బాధతోనే రైతులు అధికారులపై తిరగబడ్డారని పేర్కొన్నారు. ఏదో కుట్ర దాగి ఉన్నదని ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని జైలుకు పంపడం అక్రమమని విమర్శించారు.

లగచర్ల రైతులకు సంపూర్ణ మద్దతు

- ఫార్మా కంపెనీలకు ఏజెంట్లలా మోదీ, రేవంత్
- రైతులపై కేసులు ఎత్తివేయాలి.. పోలీసుల్ని తొలగించాలి
- 19న లగచర్లలో పార్టీ బృందం క్షేత్రస్థాయి పర్యటన
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నేత రంగారావు

ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మం, నవంబర్ 16: లగచర్ల రైతుల ధర్మబద్ధ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఫార్మా కంపెనీల కోసం రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కోవడం అన్యాయమని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టంచేశారు. ఖమ్మంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులపై అక్రమ కేసులతో జైళ్లకు పంపడం అక్రమమని, ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి.. ఫార్మా కంపెనీలకు ఏజెంట్లలా పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం సరైంది కాదని హితవు చెప్పారు. తమ పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం ఈ నెల 19న లగచర్ల ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని తెలిపారు. ఇటీవల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నేతలు కేజీ రామచందర్, కే రమ, కెచ్చెల రంగయ్య, గోకినపల్లి వెంకటేశ్వరరావు, చిన్న చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

80% మంది ఎక్కడ ఒప్పుకొన్నరు?

- తహసీల్దార్‌ను ప్రశ్నించిన రైతు
- సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు

కొడంగల్, నవంబర్ 16 : 'ఫార్మా కంపెనీల ఏర్పాటుకు 80 శాతం మంది రైతులు అంగీకరించినట్టు మీరెలా చెబుతున్నారు? అంటూ' ఓ రైతు కొడంగల్ తహసీల్దార్‌ను ఫోన్‌లో ప్రశ్నించినట్టుగా పేర్కొంటున్న ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇటీవల ఫోన్‌లో మాట్లాడగా అది శనివారం వైరల్‌గా మారింది. అయితే ఈ అంశాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్ కొట్టిపారేశారు. ఫార్మా భూసేకరణలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్న పది మందిలో ఒకరిద్దరు ఒప్పుకోవడాన్ని బట్టి.. దానిని 80 శాతంగా పేర్కొనడం జరిగిందని వివరణ ఇచ్చారు.

రాహుల్‌జీ.. రేవంత్ దాష్టీకాలను చూడండి

- నిబంధనలు ఉల్లంఘించి గిరిజనులు, దళితుల భూములు లాక్కోవడంపై చర్యలు తీసుకోండి
- ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ నేత శ్రవణ్ వినతి

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): పునరావాస చట్టం-2013పై కాంగ్రెస్ చెప్పన్న నీతులు నిజమే అయితే, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనలో సాగుతున్న దాష్టీకాలను చూడాలని బీఆర్‌ఎస్ హైదరాబాద్ ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ శనివారం ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేశారు. ఆ చట్టాన్ని ఉల్లంఘించి తన అల్లుడి కంపెనీ విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి గిరిజనుల భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. 'అభివృద్ధి పేరుతో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని గిరిజనులు, దళితులు, పేద వర్గాలకు చెందిన పట్టా భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారు. నిరుపేదలను జీవనోపాధి నుంచి దూరం చేస్తుండటం బాధాకరం. అంతకంటే దురదృష్టకరం ఏమిటంటే.. దీని వెనుక ఉద్దేశం సీఎం అల్లుడి, ఆయన అనుచరుల ప్రయోజనాలు కాపాడేందుకేనని వార్తలు వెల్లడిస్తున్నాయి' అని దాసోజు పేర్కొన్నారు.

గిరిజనులపై అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

గిరిజనులపై కాంగ్రెస్ కక్షసాధింపు

- నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: గిరిజనులపై రాష్ట్రప్రభుత్వం కక్షసాధింపు చేస్తున్నదని నిరుద్యోగ జేఏసీ చైర్మన్, ఓయూ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్ మండిపడ్డారు. లగచర్లలో నిర్మించ తలపెట్టిన ఫార్మా కంపెనీ ఏర్పాటును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో గిరిజనులను జైళ్లో నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం గిరిజనుల భూములు లాక్కోవడం అన్యాయమని అన్నారు. పోలీసులు గిరిజన వృద్ధురాలిపై దాడి చేస్తే మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఎటుపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. లగచర్లలో పేదల భూములు లాక్కోవడాన్ని ఉపసంహరించుకోవాలని, లంబాడాలపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

కొడంగల్‌లో కుంపటి.. మహారాష్ట్రలో సీఎం

- నియోజకవర్గ ప్రజల సమస్యలపై రేవంత్ మౌనం
- మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం
- మండిపడుతున్న కొడంగల్ వాసులు, నెటిజన్లు

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఘటన ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదంటూ రైతులు ఆందోళనలు ఉధృతం చేశారు. బలవంతంగా భూసేకరణకు ప్రయత్నిస్తున్న అధికారులపై గిరిజన రైతులు దాడి చేయడం నుంచి మొదలుకొని పోలీసుల అరెస్టుల వరకు ఆ ప్రాంతం అట్టుడుకుతున్నది. పోలీసులు అర్ధరాత్రి ఆందోళనకారుల ఇండ్లలోకి విరుచుకుపడి అరెస్టులు చేయడం, పోలీస్ స్టేషన్లలో చిత్రహింసలకు గురిచేయడంతో పరిస్థితి మరింత తీవ్రరూపు దాల్చింది. మా భూములు లాక్కోవద్దు మొర్రో అని మొరపెట్టుకున్న రైతులు జైలు పాలయ్యారు. బాధితుల కుటుంబ సభ్యులేమో తమవారిని కాపాడుకునేందుకు అధికారులు, రాజకీయ నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గిరిజన బిడ్డల ఆవేదనపై సర్వత్రా సానుభూతి వ్యక్తమవుతున్నది. ప్రతిపక్షాలు, ప్రజా, మహిళా, గిరిజన సంఘాలు స్పందిస్తున్నాయి. సర్కారు తీరు సరికాదని తప్పుబడుతున్నాయి. నియోజకవర్గంలో నిర్బంధపు నీడన నోరెత్తలేని దుస్థితిలో హైదరాబాద్ వచ్చిన బాధితులు తమ ఆర్తనాదాలను వినిపించారు. లగచర్ల బాధితుల గోడు మీడియాలో చర్చనీయాంశమైంది... పత్రికల్లో పతాకశీర్షికన చేరింది. పోలీసులు వ్యవహరించిన అమానవీయ వైఖరి, మహిళలను కూడా తీవ్రంగా గాయపర్చిన తీరు బాహ్యాప్రపంచానికి తెలిసింది. అసలు కొడంగల్‌లో ఏం జరుగుతున్నది? అంటూ అక్కడి అరాచకాలపై జనం ఆలోచిస్తున్నారు.

ఉట్టికెగురలేనమ్మా.. ఊరేగుతున్న వైనం

కొడంగల్‌లో అరాచకాలు ఇంత దారుణంగా జరుగుతుంటే ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం అంతా జరుగుతున్నది సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనే అయినా ఆయన నుంచి స్పందన కరవైంది. కొడంగల్ నిప్పుల కుంపటిలా మండుతున్నా రేవంత్ మాత్రం తన కేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిందిపోయి.. ఢిల్లీ, మహారాష్ట్రలో పర్యటించడంపై ప్రజానీకం మండిపడుతున్నారు. రేవంత్ శనివారం ఉదయం మహారాష్ట్రకు వెళ్లారు. రెండు రోజులపాటు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ పర్యటనపై కొడంగల్‌వాసులు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వారంలో రెండుసార్లు మహారాష్ట్రకు వెళ్లేందుకు సమయం ఉందిగానీ, బాధితుల గోడు వినేందుకు సమయం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలనే పట్టించుకోలేని వ్యక్తి, మహారాష్ట్రలో ఏ మొహం పెట్టుకుని ప్రచారం చేస్తారని నిలదీస్తున్నారు. సొంతరాష్ట్రం, సొంత నియోజకవర్గంలోని ప్రజలకు సమాధానం చెప్పకుండా, అనుమానాలను నివృత్తి చేయకుండా మహారాష్ట్ర ప్రజలకు ఏం భరోసా ఇస్తారని అడుగుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పేదల భూములు గుంజుకుంటామని చెప్తారా? అని ప్రశ్నిస్తున్నారు. లగచర్లలో ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ భూములు ఎందుకు తీసుకుంటున్నారు? పరిశ్రమలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిందిపోయి మంత్రులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు బాధితులపైనే ఎదురుదాడికి దిగుతున్నారని నెటిజన్లు మండిపడుతున్నారు.

ఎంపీని అడ్డుకున్నా బీజేపీ నేతలు స్పందించరా?

- దళిత, గిరిజన, బీసీలకు బీజేపీ వ్యతిరేకం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని తేటతెల్లం
- లగచర్ల తండాల్లో 20న పర్యటిస్తాం
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్

షాద్‌నగర్, నవంబర్ 16: లగచర్ల ఘటన అనంతరం బాధితుల పరామర్శకు వెళ్తున్న మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకున్నా ఆ పార్టీ నేతలు స్పందించకపోవడం దేనికి నిదర్శనమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబాల్‌నాయక్ ప్రశ్నించారు. గిరిజనులు, దళితులు, బహుజనులకు బీజేపీ వ్యతిరేకమనే విషయం దీంతో మరోమారు బయటపడిందని ఆరోపించారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ అరుణను అక్కడి పోలీసులు అడ్డుకుంటే కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు ఖండించలేదని అన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే అనే విషయం తేటతెల్లమైందని చెప్పారు. పేద రైతుల భూములను ఫార్మా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి ఎలాంటి ప్రొటోకాల్ లేకున్నా అక్కడి అధికారులు రాచమర్యాదలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఈ నెల 20న లగచర్ల సహా సమీప తండాల్లో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, రాష్ట్ర శాఖ బృందం పర్యటిస్తుందని తెలిపారు.

• వారం రోజులైనా కోలుకోని లగచర్ల

ఫార్మా విలేజ్ భూసేకరణలో భాగంగా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కోసం లగచర్లకు వెళ్లగా అక్కడ రైతులు ఎదురు తిరిగిన ఘటన జరిగి వారం రోజులైనా ఇంకా కోలుకోలేదు. ప్రశాంతమైన పల్లెలు, పచ్చని పొలాలున్న లగచర్ల, రోటిబండతండా, పులిచర్ల కుంట తండాల్లోని ప్రజల్లో ఇంకా భయం వీడటం లేదు. పోలీసులు ఎప్పుడు వస్తారో ఎవరినీ తీసుకెళ్తారో అనే భయంతో స్థానికులు బతుకుతున్నారు. గ్రామాలను వదిలి వెళ్లిన రైతులు, యువకులు ఇంకా తిరిగి ఇండ్లకు రాకపోవడంతో తండాలు నిర్మానుష్యంగా మారాయి. - వికారాబాద్, నమస్తే తెలంగాణ

లగచర్ల గిరిజనులపై ప్రభుత్వ తీరు దారుణం

- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

హనుమకొండ, నవంబర్ 16 : సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ఎన్నో దారుణాలు జరుగుతున్నాయని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన హనుమకొండలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఫార్మా కంపెనీలతో కలిసి సీఎం రేవంత్ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాడని విమర్శించారు. లగచర్ల గిరిజనులపై ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. లంబాడా, గిరిజన బిడ్డలతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. మహిళలని చూడకుండా కేసులు పెట్టించడం సిగ్గుచేటని అన్నారు. 'శంకర్‌నాయక్ ఒక్కడే వస్తాడు.. నువ్వా.. నేనా చూసుకుందాం.. నీకు దమ్ముంటే గన్‌మెన్‌ను పక్కకు పెట్టి గన్‌పార్కుకు రా' అంటూ సవాల్ విసిరారు. ఈ నెల 19లోగా గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు అన్యాయం చేస్తే ఊరుకోం

- ఇండ్లు కూల్చే సీఎంగా రేవంత్
- మూసీ ప్రక్షాళన పేరిట పెద్దమోసం
- చెన్నాపురం -మల్లికార్జున్ నగర్ కమాన్ రోడ్డు విస్తరణపై పునరాలోచించాలి
- ప్రభుత్వం పిచ్చిపిచ్చి పనులు చేస్తే ప్రజాగ్రహం తప్పదు : ఎంపీ ఈటల

జవహర్‌నగర్, నవంబర్ 16: పేదల ఇండ్లను కూల్చే సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని, హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదలను నడిరోడ్డున పడేశారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. పిచ్చిపిచ్చి పనులు చేసే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని, ఈ సర్కారుకు పేదల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. రోడ్డు బాధితులకు అండగా ఉంటామని, అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. 'బాలాజీ నగర్‌లో ఉండే భూములు పుక్కడివి అనుకోవద్దు.. రెక్కల కష్టం మీద బతికే పేదలు రూపాయి రూపాయి కూడబెట్టి కొనుక్కున్నరు.. రోడ్డు విస్తరణతో నిర్దాక్షిణ్యంగా పేదల ఇండ్లను కూల్చుతామంటే ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని చెన్నాపురం నుంచి మల్లికార్జున్‌నగర్ కమాన్ వరకు చేస్తున్న రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న బాధితులను శనివారం ఆయన పరామర్శించి అండగా ఉంటామని చెప్పారు. చెన్నాపురం నుంచి మల్లికార్జున్‌నగర్ కమాన్ వరకు 100 ఫీట్లు వద్దని 60 ఫీట్ల రోడ్డు చాలని బీజేఆర్‌నగర్‌వాసులు వేడుకుంటున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటుచూసినా పేదల ఇండ్లే కనిపిస్తున్నాయని, కుటుంబాలకు నిడనిచ్చేదిపోయి... ఉన్న నీడను కూడా లేకుండా చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లకాలం నిలువదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పేదల జోలికి వస్తే ఊరుకోం.. పేదల ప్రక్షాన పోరాడుతాం.. న్యాయం జరిగేవరకు అండగా నిలుస్తాం' అని స్పష్టంచేశారు. బాలాజీ నగర్‌లో కుట్టుమిషన్ కుట్టుకునే, ఇండ్లల్లో పని చేసే పేద ఆడబిడ్డలే ఉన్నారని, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారిపై ప్రభుత్వం ప్రతాపం చూపించడం మంచి పద్ధతి కాదని, రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల చెమటమీద బతికే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తే చూస్తూ ఉండబోమని, ఎల్‌ఆర్‌ఎస్ కింద డబ్బులు కట్టిన వాళ్లు కూడా ఉన్నారని, అర్ధంతరంగా ఇండ్లు కూలగొడుతామంటే ఎలా? అని ప్రశ్నించారు.

కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో
రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439
రెడ్డి స్పెషల్

వధువు కావలెను
★రెడ్డి:32 Yrs, 5'8", M.Tech (IIT) MS, Ph.D., Sr. SWE, Engg, USA, 180K P/A, 20 Cr ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి:29 Yrs, 5'10", MS, Software Australia, 100K P/A, (PR Holder), 15 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444
★రెడ్డి:29 Yrs, 5'10", B.Tech, MBA (UK), Sr. Software, Bangalore, 40 Lakhs P/A, 30 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి:28 Yrs, 6 Ft, MBBS, MS, (Ortho), Doctor, 40 Cr ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229
★రెడ్డి:29 Yrs, 5'8", MS, Data Engg., USA, 200K P/A, H1B, 25 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 7207930999
★రెడ్డి: 27 Yrs, 5'8", M.Tech, (IIT), Sr. Design Engg., Bangalore, 2 L P/M గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి: 29 Yrs, 5'10", B.Tech, (Bits Pilani), Software, 22 Lakhs P/A, 10 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి: 27 Yrs, 6 Ft, MS, USA, Software (Green Card), 160K P/A, 50 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444
★రెడ్డి (GUDATI):33 Yrs, 5'11", B.Tech., MS, Software, USA, 150K P/A, I-140, 70 Cr. ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి:33 Yrs,5'7", B.Sc., Sr. Asst. (Govt. Job),80,000/- P/M, 10 Cr. ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999

వరుడు కావలెను
★రెడ్డి:30 Yrs, 5'4", M.Tech (IIT), MS, Software, USA,180K P/A, H1B, 6 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి:30 Yrs, 5'4", B.Tech, Software, Hyd, 10 Lakhs P/A గల Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. 9010051444
★రెడ్డి:26 Yrs, 5'4", MBBS, MS, Doctor, Hyd 30 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన MD Doctor వరుడు కావలెను. 9030315599
★రెడ్డి:26 Yrs, 5'6", MS, Australia, Associate Engg, 120 K P/A, 10 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★రెడ్డి:28 Yrs, 5'4", MBA, (IIM), Manager, 32 Lakhs P/A గల Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229
★రెడ్డి(Motati):31 Yrs, 5'5", B.Tech., MS, Software, USA, 280K P/A, Full Time Job గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★రెడ్డి:28 Yrs, 5'3", CA, Sr. Accounts Manager, 8 Lakhs P/A, గల వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999
★రెడ్డి:29 Yrs, 5'5", B.Tech., Software, Hyd, 1 Lakh P/M గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229
★రెడ్డి:29 Yrs, 5'5", B.Tech., MS, Software, USA, Full Time Job, (I-140), 10 Cr. ప్రాపర్టీ, 160K P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి: 26 Yrs, 5'9", B.Tech., Software, Accenture, 10 Lakhs P/A, 10 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

వేదికలు
★ ఫ్రీ: అన్ని కులముల/మొదటి/రెండవ/లేటు...వధువు/వరుల వివాహ సంబంధములకై మీ ఫొటో, బయోడేటా, మా వాట్సాప్ నెంబరు (9291503949)కు పంపించగలరు. ''మా సేవ'' మ్యారేజ్ బ్యూరో (Since 1998) Ph: 9291503949
★ ఫ్రీ రిజిస్ట్రేషన్: కాపు, మున్నూరుకాపు వధూ వరులకు స్వయంవరం, 15 డిసెంబర్ 2024. వేదిక: కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్. ECIL, HYD-062, Time: 10 AM to 4 PM. Ph: 9704656103, (9533608887-WhatsApp)

వధువు కావలెను
★ Brahmin Iyer, Pooratadhi2, 38 Yrs, 173cm., MBA/Pvt. CBE/SA Seeking Brahmin Bride. Ph: 8015306465

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857